క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బంట్వారం: తాండూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో పీటీఆర్-2 మరమ్మతు పనుల కారణంగా గురువారం బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏఈ సురేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఇఫ్తార్ విందు నేడు

మోమిన్‌పేట: ప్రభుత్వం తరఫున ముస్లింలకు గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ తెలిపారు. మండల కేంద్రంలోని సూపర్ డీలక్స్ ఫంక్షన్‌హాల్‌లో సాయంత్రం 6గంటలకు విందు ఉంటుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హాజరు కానున్నట్లు ఆయన వెల్లడించారు. కావున ముస్లింలు అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని వెంకట్ కోరారు.

ఇబ్బంది పడుతున్నాం.. జీతాలు పెంచండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

దోమ: ఐకేపీలో పని చేస్తున్న వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)ల సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ షాహెదా బేగంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామస్థాయిలో వీఓఏలు ఎంతో చురుగ్గా పనిచేస్తున్నా.. చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వీఓఏలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని దేవాలయంలో బుధవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆలయ మండపంలో భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో లింగాష్టక పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివలింగానికి పంచామృతం, చెరుకు రసం, వివిధ రకాల పండ్ల రసాలు, చక్కెరతో అభిషేకం నిర్వహించారు. ధూప దీప నైవేద్యం సమర్పించారు. మంగళహారతులు పడుతూ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలను గుర్తించాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

కుల్కచర్ల: బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి తెలుగు దేశం పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్ అన్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం అభివృద్ధి పనులను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. అదే విధంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాసయ్య మాట్లాడుతూ.. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలను ప్రజలు గుర్తించాలన్నారు. ఎన్టీఆర్ పాలనలో పేద ప్రజల సమస్యలు గుర్తించి, సమస్యల పరిష్కారానికై కృషిచేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో రామస్వామి, రవి, నర్సింహులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో ముస్లింలు

తాండూరు: పట్టణంలోని సమద్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం దిశగా..

- పావులు కదుపుతున్న సభ్యులు!
- ఎంపీపీ తీరుపై అసంతృప్తి
- బాలేశ్వర్‌గుప్తా తీరుకు నిరసనగా ఎంపీటీసీల గైర్హాజరు
- సమావేశం రెండోసారి వాయిదా



సమావేశం వాయిదా పడటంతో హాలు బయట ఉన్న ప్రజాప్రతినిధులు

యాలాల: కోరం లేక గత సోమవారం వాయిదా పడిన సర్వసభ్య సమావేశం.. బుధవారం మరోసారి సీన్ రిపీట్ అయింది. ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా వ్యవహార శైలితో ఎంపీటీసీలు గైర్హాజరు కావడం.. ఫలితంగా సమీక్ష వాయిదా పడడం వలన సభ్యుల మధ్య కోల్డ్‌వార్ బహిర్గతమైంది. సోమవారం నాటి సమావేశానికి 13 మంది ఎంపీటీసీలకు గాను.. ముగ్గురు మాత్రమే హాజరుకావడంతో బుధవారానికి వాయిదా వేశారు. అయితే నిన్న కూడా అదే జరిగింది. సమావేశానికి స్వరూప రాణి(జుంటుపల్లి), సరిత(రాస్నం) ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉందని ఎంపీడీఓ పుష్పలీల ఎజెండాలో పేర్కొనడంతో వివిధ గ్రామాల సర్పంచ్‌లు మీటింగుకు హాజరయ్యారు. అయితే సమావేశ నిర్వహణకు నిబంధనల ప్రకారం సభ్యుల సంఖ్యలో 1/3వంతు సభ్యులు అనగా ఐదుగురు సభ్యులు (ఎంపీపీతో సహా) హాజరై ఉండాలి. కానీ.. మధ్యాహ్నం 12 గంటల వరకు ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే రావడంతో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా సభ నడపడాని ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వైస్ ఎంపీపీ రమేష్, రాములు(పగిడియాల) ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. సమావేశ నిర్వహణకు సభ్యుల సంతకాలు రిజిస్టర్‌లో చేయాల్సి ఉండగా.. వైస్ ఎంపీపీ సంతకం చేసేందుకు నిరాకరించారు. ఎంపీటీసీల విషయంలో ఎంపీపీ వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా తాము సభకు రావడం లేదని, తనను బలవంతంగా తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఎంపీపీతో పాటు ఎంపీడీఓ పుష్పలీల వ్యవహారంపై వైస్ ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదన!

ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తాపై పదిమంది ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. పదవీ కాలం నాలుగేళ్లు పూర్తికావస్తున్న నేపథ్యంలో.. అవిశ్వాసానికి ఎంపీటీసీలు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ఎంపీపీ, ఎంపీటీసీల మధ్య సయోధ్య కుదరకపోవడం, ఎంపీటీసీల సంతకాలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చేలా ఎంపీపీ వ్యవహరిస్తున్నారని పలువురు ఎంపీటీసీలు ఆరోపిస్తున్నారు.

మీడియాపై ఎంపీపీ మండిపాటు!

సమీక్ష నిర్వహణకు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయాల్సిందిగా.. రిజిస్టర్ పట్టుకొని వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలను ఎంపీపీ అభ్యర్థిస్తుండగా.. పలువురు మీడియా ప్రతినిధులు ఫొటోలు తీసేందుకు యత్నించారు. దీంతో 'మీకు ఫొటోలు తీసుకునేందుకు ఇదే సమయమా? బయటికి వస్తాం. ఎన్ని ఫొటోలైనా తీసుకోండి' అంటూ ఎంపీపీ అసహనం వ్యక్తం చేయడం గమనార్హం.

ఎన్నాళ్లీ కంకర రోడ్డు కష్టాలు

పరిగి: కంకర తేలిన రోడ్డుతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణ కేంద్రంలోని ఎర్రగడ్డపల్లికి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమై.. వాహనాలు వెళ్లని దుస్థితి నెలకొంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలుగు నెలల క్రితం ప్రజా ప్రతినిధులు రోడ్డు వేయిస్తామని పూజా కార్యక్రమాలు పూర్తి చేశారని, కానీ నేటి వరకు పనులు ప్రారంభించలేదని మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా.. మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామం నుంచి సుల్తాన్‌పూర్‌కు వరకు రోడ్డు పూర్తిగా కంకర తేలి, ప్రయాణం కష్టతరంగా మారిందని బాధిత గ్రామాల ప్రజలు వాపోయారు. ఇదే అంశంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నారాయణపూర్ నుంచి సుల్తాన్‌పూర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి

గిరిజన గురుకులంలో సమ్మర్ క్యాంప్

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గ్రామపరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో సమ్మర్ స్పార్కర్ల క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గంగారాం నాయక్ తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని గిరిజన గురుకులాల్లో సూమారు 200మంది విద్యార్థులు ఈ క్యాంప్‌లో పాల్గొననున్నారని, వీరికి నేచరలిస్ట్, ఎక్స్‌ప్రెసివ్ ఆర్ట్స్, పెన్సిల్ గ్రాఫిక్స్, యోగ, స్పోర్ట్స్ విభాగాల్లో 15రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇందుకు 22వ తేదీలోపు సంబంధిత పాఠశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

అభివృద్ధి చేస్తున్నా.. ఆశీర్వదించండి



మర్పల్లిలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

- తాండూరుకు ఎన్ని నిధులైనా వస్తాయి
- 'పల్లెపల్లెకు పైలెట్'లో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

బషీరాబాద్: 'తాండూరు గడ్డమీద పుట్టిన బిడ్డను నేను. ఈ గడ్డ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి వందల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి పనులు చేస్తున్నా.. నన్ను ఆశీర్వదించండి' అని తాండూరు ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. పల్లెపల్లెకు పైలెట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఇస్మాయిల్‌పూర్, జలాల్‌పూర్, నీళ్లపల్లి, మర్పల్లి, పర్వత్‌పల్లి, నవల్గా, గొట్టిగఖుర్దు, గొట్టిగకలాన్, కాశీంపూర్ తదితర గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో ప్రతి గ్రామంలో రూ.కోటికి పైగా నిధులతో అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీరోడ్లు, మురుగు కాలువలు, జీపీ భవనాలు వంటి పనులకు శంకుస్థాపనలు చేశామని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తెచ్చి, అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీఇచ్చారు. గతంలో ఏ ఎమ్మెల్యే, ఏ మంత్రి ఒకేసారి ఒక గ్రామానికి రూ.50 లక్షలు ఇచ్చిన దాఖలాలు తెలంగాణ రాష్ట్రంలో లేవన్నారు. ఈ నిధులతో దాదాపు 80 శాతం పనులన్నీ పూర్తవుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీశైలంరెడ్డి, మండల అధ్యక్షుడు రాము నాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, మాజీ ఎంపీపీ భాస్కర్, సీనియర్ నాయకుడు నర్సిరెడ్డి(రాజు), సర్పంచులు హన్మిబాయి, వసంత, సువర్ణ, నీలమ్మ, లాలుప్రసాద్, అనురాధ, విష్ణు, సాబేర్, నాయకులు గోపాల్ రెడ్డి, పాండురంగా రెడ్డి, అనంతయ్య, రుక్మారెడ్డి, మండల అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి



అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం అందజేస్తున్న మారుతి కిరణ్

కుల్కచర్ల: అంబేడ్కర్ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి అన్నారు. బుధవారం చౌడాపూర్ అనుబంధ గ్రామమైన బూరెడ్డిపల్లిలో బుడగ జంగం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.10వేలు విరాళం అందజేసి మాట్లాడారు. నేటి యువత అవకాశవాద రాజకీయాలకు దూరంగా ఉంటూ.. బాబాసాహెబ్ సూచించిన మార్గంలో పయనించాలని, అప్పుడే సమాజ అభ్యున్నతి సాధ్యమవుతుందని చెప్పారు.

ఆర్థిక సహాయం

కల్మన్‌కాల్వ గ్రామానికి చెందిన నర్సమ్మ అనే బీజేపీ కార్యకర్త మృతిచెందగా.. బీజేపీ మండల అధ్యక్షుడు బంధయ్య ఆధ్వర్యంలో బాధిత కుటుంబీకులకు తక్షణ సహాయంగా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్ కుమార్, నాయకులు పురుషోత్తం, మల్లికార్జున్, కృష్ణాజి, మాసయ్య, రాజేందర్ రెడ్డి, నరేష్, శ్రీను, శివప్రసాద్, రఘు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోండి



రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్ తదితరులు

మర్పల్లి: ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బట్టు లలిత అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ రాజ్ మల్లయ్యతో కలిసి ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ మైనార్టీల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రంజాన్ సందర్భంగా 350 పేద ముస్లిం కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు శరీఫ్, బీఆర్‌ఎస్ మర్పల్లి పట్టణ ప్రెసిడెంట్ గఫార్, మార్కెట్ డైరెక్టర్ గౌస్, ఆర్బి మాధవరెడ్డి, ఎంపీఓ మహేశ్, మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ యూత్ కమిటీ ఎన్నిక



యూత్ కమిటీ అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న అనిల్

బంట్వారం: బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి యూత్ కమిటీలు కృషి చేయాలని ఆ పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు అనిల్ అన్నారు. బుధవారం కరీంపూర్ గ్రామంలో పార్టీ యూత్ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలంటూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం నూతన కమిటీని నియమించారు. కరీంపూర్ యూత్ కమిటీ అధ్యక్షుడిగా జహీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సుభాష్, ప్రధాన కార్యదర్శిగా హరీఫ్, కోశాధికారిగా లక్ష్మణ్, కార్యదర్శిగా ఇస్మాయిల్, సోషల్ మీడియాకు కావలి ప్రశాంత్‌ను నియమించారు. కార్యక్రమంలో పార్టీ యూత్ కమిటీ మండల అధ్యక్షుడు కొండల్ రెడ్డి, నాయకులు సాదత్, కరీం, సలీం, యూసుఫ్, మహబూబ్, రజాక్, రవి, ఏసు, శివరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- నివారణ చర్యలపై అవగాహన పెంచుకోవాలి
- అగ్నిమాపక వారోత్సవాల్లో ఫైర్ సిబ్బంది



తాండూరు టౌన్: సిలిండర్‌కు అంటుకున్న మంటలను ఆర్పుతున్న ఉపాధ్యాయురాలు



కొడంగల్ రూరల్‌లో..

తాండూరు టౌన్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తాండూరు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ నాగార్జున అన్నారు. బుధవారం పట్టణంలోని నేతాజీ గురుదేవ్ గురుకుల్ పాఠశాలలో ఫైర్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. వంట గదిలో గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకొని, సామగ్రి తగలబడి పోతున్న సమయంలో చేపట్టాల్సిన చర్యలపై ప్రదర్శన ఇచ్చారు. అనంతరం గంగోత్రి విద్యాలయంలో విద్యార్థులకు అగ్నిప్రమాద నివారణ చర్యలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ వంట గదిలో కానీ, ఇంట్లో లేదా పరిసరాల్లో మంటలు అంటుకున్నట్లైతే.. ప్రదర్శనలో చూపిన విధంగా వాటిని అదుపులోకి తీసుకురావాలని సూచించారు. ఆ తరువాత 101కు సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని పట్ల జాగ్రత్తగా ఉంటే ఎలాంటి ప్రమాదాలు సంభవించవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది గోపాల్, ఖాజ, శ్రీనివాస్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: పట్టణంలోని లాహోటీ సూపర్ మార్కెట్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం కరపత్రాలు పంచి, వాల్‌పోస్టర్లు అతికించారు. కార్యక్రమంలో ఐసీఎస్ఎఫ్ఓ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది సయ్యద్ మతీన్, ఆనందం, శ్యామప్ప, ఎండీ బురానుద్దీన్, చంటీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఎంపీడీఓ సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులపై బుధవారం ఎంపీడీఓ సత్తయ్య పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిపనులు శరవేగంగా కొనసాగాలని చెప్పారు. కూలీల సంఖ్య ఎక్కడైతే తక్కువగా ఉందో అక్కడ మరింత పెంచేవిధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పొలాలకు రైతులు వెళ్లే బాటలు వేయడం లాంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉపాధి కూలీలు నిర్దేశించిన సమయానికి వచ్చి పనులు పూర్తి చేసి మొత్తం కూలి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ శీను, ఎంపీఓ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం బోల్తా



రహదారికి అడ్డంగా బోల్తాపడిన వాహనం

బొంరాస్‌పేట: రోడ్డుకు అడ్డంగా వాహనం బోల్తా పడిన సంఘటన జాతీయ రహదారి 163పై రేగడిమైలారం సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొడంగల్‌కు చెందిన ఓ స్టీలు వ్యాపారి హైదరాబాద్ నుంచి తన వాహనంలో సామగ్రి తీసుకువస్తున్నాడు. కొడంగల్‌కు మరో 6కిలో మీటర్ల దూరంలో ఉండగా.. కనురెప్పపాటులో వాహనం రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ప్రమాదం తప్పించబోయే క్రమంలో వాహనం బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. రహదారికి అడ్డంగా ఉన్న వాహనాన్ని తొలగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అంగన్‌వాడీలో అవగాహన

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో భరోసా కేంద్రం తరఫున పిల్లల తల్లిదండ్రులకు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లల పట్ల తల్లిదండ్రులు ఎలా ప్రవర్తించాలో వివరించారు. ఫోన్ల వాడకం వలన కలిగే నష్టాల గురించి చెప్పారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

ధారూరు: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ భువనేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 20, 2020 కంటే ముందు ఇంటిని నిర్మించుకొని, అందులో నివాసం ఉన్న వారు జీఓ నంబర్ 58,59 కింద క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఈ జీఓ ప్రకారం 125 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించుకున్న వారికి ఉచితంగా, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకుంటే ప్రభుత్వానికి తగిన రుసుము చెల్లిస్తే క్రమబద్ధీకరించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అర్జీ పెట్టుకోవాలన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటించారు.

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'

నేత్ర శిబిరం ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు



పరిగి: కంటి పరీక్ష చేయించుకుంటున్న కౌన్సిలర్ అనసూయ

దోమ: అంధత్వ నివారణకోసం రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కంటి చూపు మందగించిన వారికి వైద్యులు పరీక్ష చేసి, మందులు, కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీటీసీ బంగ్ల అనిత, ఉపసర్పంచ్ గోపాల్‌గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పరిగి: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ అన్నారు. పట్టణ కేంద్రంలోని 13వ వార్డులో రెండో విడత కార్యక్రమాన్ని కౌన్సిలర్ అనసూయతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో కంటి పరీక్ష చేసి మందులు, అవసరమున్న వారికి కళ్లద్దాల పంపిణీ, ఉచితంగా శస్త్రచికిత్స చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

తట్టెపల్లికి మండల హోదా ఇవ్వాలి



దీక్షలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ గెమ్యా నాయక్

పెద్దేముల్: కర్ణాటక సరిహద్దులోని తట్టెపల్లి గ్రామానికి మండల హోదా ప్రకటించాలని మండల సాధన కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రిలే నిరాహార దీక్షలో తట్టెపల్లితో పాటు పాషాపూర్, ఓంలానాయక్‌తండా, బండమీదిపల్లి తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి స్పందించి వెనుకబడిన తట్టెపల్లి గ్రామాన్ని మండలంగా ప్రకటించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గెమ్యా నాయక్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్, విజయ్, సత్తార్, సాధన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం కాపాడవచ్చు



అంగన్‌వాడీలకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గోపాల్

తాండూరు రూరల్: మనిషి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు సీపీఆర్ చేసి ప్రాణం కాపాడవచ్చని డాక్టర్ గోపాల్ సూచించారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో తాండూరు మున్సిపల్, మండలంలోని పలు గ్రామాల అంగన్‌వాడీలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. మనిషి ఆక్సిజన్ తీసుకోలేనప్పుడు, గుండె ఆక్సిజన్ పంపింగ్ ఆగిపోతున్న సమయంలో సీపీఆర్‌తో ప్రథమ చికిత్స చేయాలని చెప్పారు. గుండె ఆగిపోయిన వెంటనే సీపీఆర్ చేస్తే మనిషిని బతికించుకునే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ రేణుక, సూపర్‌వైజర్లు నిర్మల, జ్యోతి, మీనాక్షి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.